అధ్వానం.. అంతర్గత రోడ్లు



- రోడ్లను తవ్వి అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ నిర్మాణం
- అధికారుల సమన్వయ లోపంతో ఆగిన పనులు
- గుంతలతో రాకపోకలకు ఇబ్బందులు

ఆల్విన్‌కాలనీ: అధికారుల నిర్లక్ష్యంతో అంతర్గత రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. ప్రజలకు ప్రాణ సంకటంగా తయారవుతున్నాయి. కూకట్‌పల్లి సర్కిల్‌ ఆల్విన్‌ కాలనీ ఫేజ్‌ 1లో అంతర్గత రహదారులను తవ్వి అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టి నెలలు గడుస్తున్నప్పటికీ రహదారులు నిర్మించకుండా వదిలి వేశారు. దీంతో ఆ ప్రాంత రహదారులు అధ్వానంగా తయారవుతున్నాయి. ఆ రహదారులపై రాకపోకలు సాగించలేక ప్రయాణికులు, నడవలేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతలతో కూడిన రహదారులు కావడంతో చాలీ చాలని ఇరుకైన రహదారుల్లో ఎదురుగా వచ్చిన వాహనాలను తప్పించలేక ప్రమాదాలతో గాయాల పాలవుతున్నారు. వయోవృద్ధులు, చిన్నారులు ఆరు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమన్వయలోపం.. ప్రజలకు శాపం

వాటర్‌వర్క్స్‌ అధికారులు, జీహెచ్‌ఎంసీ అధికారుల సమన్వయ లోపంతో పనుల్లో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. వాటర్‌వర్క్స్‌ అధికారులు రోడ్లను తవ్వి డ్రైనేజీ నిర్మించి మమ అనిపించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవటంతో రోడ్లు అధ్వానంగా తయారవుతున్నాయి. డ్రైనేజీ నిర్మించిన కొన్ని రోజులకు ప్యాచ్‌ వర్కులు కానీ, శాశ్వత రోడ్డు నిర్మాణం కానీ నిర్మించాల్సి వుంటుంది. రెండు డిపార్టుమెంట్‌ల మధ్య సమన్వయం కొరవడి ప్రజలకు శాపంగా మారింది. సమస్యకు పరిష్కారం నోచుకోకుండా కాలయాపన జరుగుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు కాలనీల్లో పర్యటించి శాశ్వత నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్‌ చేస్తున్నారు.





ఆల్విన్‌కాలనీ 1 ఫేజ్‌లో అధ్వానంగా మారిన అంతర్గత రహదారులు

విద్యుత్‌ సమస్యలు పరిష్కరించాలి



విద్యుత్‌ సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ సబిహా బేగం, ఏఈ భీమయ్య తదితరులు

మోతీనగర్: అల్లాపూర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ సబిహా బేగం డివిజన్‌ పరిధిలోని రాజీవ్‌ గాంధీనగర్, సఫ్దార్‌ నగర్‌లలో నెలకొన్న విద్యుత్‌ సమస్యలను ఏఈ భీమయ్యతో కలిసి శనివారం పరిశీలించారు. బస్తీల్లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పలు వీధుల్లో అంధకారం ఉన్న ప్రదేశాల్లో కొత్త స్తంభాలు వేయించాలని, కేబుల్స్‌, నూతన ట్రాన్స్‌ఫార్మర్, ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను వేరే ప్రాంతానికి మార్చటం, ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ కంచె వేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో హమీద్, రియాజ్, సలీం, రాంబాబు, సలావుద్దీన్, మల్లేష్, సల్మాన్, బాబా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

ఆల్విన్‌కాలనీ: ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని శనివారం వివేకానందనగర్‌ డివిజన్‌ కాంగ్రెస్‌ పార్టీ కంటెస్టెడ్‌ కార్పొరేటర్‌ బాషిపాక నాగమణి యాదగిరి మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఆయన సానుకూలంగా స్పందించారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



మోతీనగర్: వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగి వున్న నైపుణ్యాన్ని వెలికితీయడానికి దోహదపడతాయని మెగా స్కూల్‌ కరస్పాండెంట్‌ రఘువీర్‌నాథ్‌రావు అన్నారు. అల్లాపూర్‌ డివిజన్‌ గాయత్రినగర్‌లోని మెగా స్కూల్‌లో శనివారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. కొన్ని రోజుల నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నేతృత్వంలో పలు నమూనాలు తయారు చేశారు. వాటిని పలువురు సందర్శించి విద్యార్థులను అభినందించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ సుచిత పాటిల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీనియర్‌ సిటిజన్స్‌కు సహకారం అందిస్తా

మోతీనగర్: సీనియర్‌ సిటిజన్స్‌కు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని ఎంసీహెచ్‌ఎస్‌ పర్సనల్‌ చైర్మన్‌ హనుమంతరావు అన్నారు. మూసాపేట డివిజన్‌ మోతీనగర్‌ ఎంసీహెచ్‌ఎస్‌ సీనియర్‌ సిటిజన్‌ ఫోరం ఆధ్వర్యంలో శనివారం ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమితులైన హనుమంతరావును శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్‌ సిటిజన్‌ ఫోరం అధ్యక్షులు డాక్టర్‌ ప్రసాద్‌ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం సీనియర్‌ సిటిజన్స్‌ ఫోరం ఎంసీహెచ్‌ఎస్‌ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలతో పాటు పలు ప్రజా కార్యక్రమాలకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో శేషగిరిరావు, బీజముల్ల నాగేశ్వరరావు, నలమాల్పు అంజిరెడ్డి, సాగర్, హేమంత్‌ తదితరులు పాల్గొన్నారు.

కళాసిల్క్‌ చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం



మోతీనగర్: చేనేత కళాకారులని మరింత ప్రోత్సహించే లక్ష్యంతో మోతీనగర్‌ కమ్యూనిటీ హాల్‌లో చేనేత హస్తకళ వస్తువుల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు కళాసిల్క్‌ సొసైటీ ప్రతినిధి వికాస్‌ జైన్‌ తెలిపారు. శనివారం వస్త్ర ప్రదర్శనను ప్రారంభించారు. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పోచంపల్లి చీరలు, బెడ్‌షీట్‌లు, వెస్ట్‌ బెంగాల్‌ జాందాన్ని, రాజస్థాన్, మంగళగిరి, ఉప్పాడ, ధర్మవరం చీరలు, కలంకారి చేనేత డ్రెస్‌ మెటీరియల్, లక్నో చికెన్‌ వర్కు కుర్తాస్, వన్‌ గ్రామ్‌ గోల్డ్‌ ఆభరణాలు, యువత మెచ్చే విధంగా వస్త్ర ప్రదర్శన అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రదర్శన జనవరి 13 వరకు కొనసాగుతుందని చెప్పారు. ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



కళాసిల్క్‌ చేనేత వస్త్ర ప్రదర్శనలో కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

రేపటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

మూసాపేట: భరత్‌నగర్‌ కాలనీలోని హరిహర క్షేత్రంలో సోమవారం నుంచి ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్‌ నాగిరెడ్డి శనివారం తెలిపారు. సోమవారం ఉదయం 4 నుంచి గోదాదేవి తిరుమంజనం, ప్రతి రోజూ ఉదయం 5 గంటలకు తిరుప్పావై సేవకాలం, జనవరి 4 నుంచి 10 గంటలకు లక్ష తులసి అర్చన, 8న సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపాలంకరణ, 10న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శనం, 11న కూడార్పై, 13న గోదా రంగనాథ స్వామి కల్యాణం వంటి పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

అయ్యప్ప స్వాములకు అల్పాహారం



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి, వివేకానంద నగర్‌లోని అయ్యప్ప స్వామి దేవస్థాన ప్రాంగణంలో శనివారం స్వాములకు అల్పాహారం అందించారు. దాతలను గురుస్వాములు అభినందించారు. కార్యక్రమంలో దాతలు చెన్నయ్య, సురేందర్‌రెడ్డి గురుస్వాములు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్‌ తహసీల్దార్‌ లాల్‌సింగ్, ఆర్‌ఐ భానుచందర్, కార్పొరేటర్‌ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తహసీల్దార్‌ లాల్‌సింగ్, ఆర్‌ఐ భానుచందర్, కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్‌ స్కూల్‌ బాయ్స్‌1, జూనియర్‌ కాలేజీ క్యాంపస్‌లో శనివారం జరిగిన నూతన కామన్‌ డైట్‌ ప్లాన్‌ ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడారు. భవిష్యత్‌లో మంచి ర్యాంకులు సాధించి ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

బాధితురాలికి ఫోన్‌ అప్పగింత



బాలానగర్: అమీర్‌పేట్‌ నుంచి బాలానగర్‌కి శుక్రవారం రాపిడో ఆటోలో ప్రయాణించిన ఓ మహిళ తన ఫోన్‌ని ఆటోలో మరిచిపోయింది. తర్వాత గమనించిన బాధిత మహిళ మీనా వెంటనే బాలానగర్‌ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు స్పందించిన క్రైమ్‌ పోలీసులు ఆనంద్, అతని బృందం రాపిడో కాల్‌ సెంటర్‌ సహకారంతో ఓ గంట వ్యవధిలో ఆటోను గుర్తించి బాధిత మహిళకు మొబైల్‌ని బాలానగర్‌ పోలీసులు అప్పగించారు. బాలానగర్‌ క్రైమ్‌ కానిస్టేబుళ్లు ఆనంద్, కృష్ణలను సీఐ నర్సింహరాజు అభినందించారు. ఎవరైనా మొబైల్‌ పోగొట్టుకుంటే ఐఎంఈఐ వివరాలు, బాధితుడి ఆధార్‌ కార్డు జిరాక్స్‌ ఇస్తే మొబైల్‌ ఫోన్‌ ఆచూకీ తెలుసుకొని బాధితులకు అప్పగిస్తామని తెలిపారు.

గురుకులాలను సందర్శించిన ఉన్నతాధికారులు



ఘట్‌కేసర్‌ ఫైన్‌ ఆర్ట్స్‌ స్కూల్‌లో సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్‌ గౌతం

ఘట్‌కేసర్: తెలంగాణ ప్రభుత్వం 40 శాతం డైట్‌ చార్జీలు పెంచిన సందర్భంగా పలువురు ఉన్నతాధికారులు సాంఘీక సంక్షేమ జ్యోతిరావు పూలే గురుకులాలను శనివారం సందర్శించారు. ఎదులాబాద్‌లోని తెలంగాణ ఫైన్‌ ఆర్ట్స్‌ స్కూల్‌ను మేడ్చల్‌ జిల్లా కలెక్టర్‌ గౌతం, అంకుషాపూర్‌లోని జగద్గిరిగుట్ట బాలికల పాఠశాల, జూనియర్‌ కళాశాలను డ్రగ్స్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టర్‌ జనరల్‌ కమలహాసన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మహిళా డిగ్రీ కళాశాలను హైదరాబాద్‌ ఈస్ట్‌ జోన్‌ డీసీపీ బాలస్వామి, ఘనాపూర్‌లోని జ్యోతిరావు పూలే బాలుర పాఠశాలను ఐఏఎస్‌ వినయ్‌ కష్టారెడ్డి, డీఆర్‌డీఓ సాంబశివరావు పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెంచిన మెస్‌ చార్జీలను తక్షణమే అమలు చేసి మెనూ చాట్‌లో నిర్ణయించిన మేరకు పౌష్టికాహారం వడ్డించాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఫ్యాకల్టీకి సూచించారు. ఆహారం రుచిగా వండడానికి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తామని, అన్ని వసతి గృహాలలో ఏకరీతి ఆహారం అందించాలని ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పావనీజంగయ్య, సోషల్‌ వెల్ఫేర్‌ జిల్లా అధికారి వినోద్‌కుమార్, తహసీల్దార్‌ రజని, ప్రిన్సిపాల్స్‌ రాధిక, రేణుక, వైస్‌ ప్రిన్సిపాల్స్‌ రాములు, రాము పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కేపీహెచ్‌బీ కాలనీ : హోటల్‌ లో సర్వెంట్‌ గా పని చేస్తున్న వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీసు స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వైఎస్‌ఆర్‌ కడప జిల్లా దువ్వూరుకు చెందిన హరికృష్ణ (20) మైదుకూరులోని వెంకట సాయి హోటల్‌లో కార్మికుడిగా పని చేసేవాడు. అతని పనితీరు నచ్చి రెండు సంవత్సరాల కిందట కేపీహెచ్‌బీలోని రాయలసీమ హోటల్‌లో పనికి తీసుకువచ్చాడు హోటల్‌ యజమాని వెంకట సాయి. అప్పటి నుంచి రాయలసీమ హోటల్‌లో హరికృష్ణ పని చేస్తున్నాడు. పనికి జీతం ఇవ్వాలని అడిగితే హోటల్‌ యజమాని వెంకట సాయి అతని కొడుకు శరత్‌లు తనను దూషిస్తున్నారని, కొడుతున్నారని హరికృష్ణ తన తండ్రికి తెలిపాడు. సర్ది చెప్పి పని చేసుకోవాలని తండ్రి సూచించాడు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు హోటల్‌ యజమాని వెంకట సాయి ఓబన్నకు ఫోన్‌ చేసి మీ కొడుకు హరికృష్ణ నీటి సంపులో పడిపోయాడని సమాచారం ఇచ్చాడు. మళ్లీ కొద్దిసేపటి తరువాత బాత్రూమ్‌లో జారిపడ్డాడని తెలుపగా.. ఆసుపత్రికి తీసుకువెళ్లాలని ఓబన్న సూచించాడు. తిరిగి రాత్రి తొమ్మిది గంటలకు ఇతరుల ద్వారా హరికృష్ణ మృతి చెందినట్లు ఓబన్నకు సమాచారం పంపించాడు. హరికృష్ణ మృతదేహం గాంధీ ఆసుపత్రిలో ఉన్నట్లు తెలుసుకున్న ఓబన్న నగరానికి వచ్చి తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని, హోటల్‌ యజమాని వెంకట సాయి, అతని కొడుకు శరత్‌లపై అనుమానం ఉందని కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు రిమాండ్‌

మియాపూర్: భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో భర్తను మియాపూర్‌ పోలీసులు అరెస్ట్‌ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. వెంకట నాగలక్ష్మీ ఆన్‌లైన్‌లో గడ్డి మందు తెప్పించుకుని తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం ఏలూర్‌ జిల్లా లింగంపాలెం మండలం తోచిలుక గ్రామానికి చెందిన మువ్వా మణికంఠ మనోజ్‌(31) అదే జిల్లా చిత్తాపూర్‌కు చెందిన మొక్కపాటి నాగలక్ష్మీని ఆగస్టు 22న వివాహం చేసుకున్నారు. కాగా నాగలక్ష్మిని భర్త మనోజ్‌ శారీరకంగా, మానసికంగా వేధించడంతో ఆత్మహత్య చేసుకుందని మనోజ్‌పై చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మనోజ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలో కార్పొరేటర్‌ నర్సింహయాదవ్, ఆలయ నిర్వాహకులు

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: ఓల్డ్‌ బోయిన్‌పల్లి డివిజన్‌ భవానీనగర్‌లో దుర్గభవానీ ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన శనివారం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య హోమాలు, అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్‌ ముద్దం నర్సింహయాదవ్‌ దంపతులు పాల్గొన్నారు. దంపతులకు పట్టు వస్త్రాలు అందజేసి సన్మానించారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు సాయిలు, సుందర్, ఆంజనేయులు, సతీష్‌యాదవ్, వెంకటేశం, శేఖర్, రమేష్‌యాదవ్, సునంద, నాయకులు నరేందర్‌గౌడ్, కర్రె జంగయ్య, మక్కాల నర్సింగ్‌రావు, బలవంత్‌రెడ్డి, బుర్రి యాదగిరి, లలిత తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమరానికి సన్నద్ధం

ఈ నెల 17న తుది పోలింగ్‌ కేంద్రాల జాబితా విడుదల

- జనవరిలో ఎన్నికల నోటిఫికేషన్‌ జారీ అయ్యే అవకాశం
- ఓటర్ల జాబితా సిద్ధం చేసిన పంచాయతీ శాఖ

సాక్షి, సిటీబ్యూరో: పంచాయతీ ఎన్నికలకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. జనవరిలో నోటిఫికేషన్‌ వెలువడవచ్చనే సంకేతాలతో ఏర్పాట్లపై దృష్టి సారించారు. గ్రామాలు, వార్డుల వారీగా ఇప్పటికే ఓటరు జాబితా సిద్ధం చేయగా, తాజాగా పోలింగ్‌ కేంద్రాల గుర్తింపు సైతం పూర్తి చేశారు. త్వరలో కొత్త సర్పంచులు వస్తారని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలతో రాజకీయ పార్టీల ప్రతినిధులు గ్రామాల్లో కార్యకలాపాలు ముమ్మరం చేశారు. ఒక్కొక్క వార్డుకు ఒక్కొక్క పోలింగ్‌ కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. నగర శివారు మేడ్చల్‌–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 580 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో మేడ్చల్‌ జిల్లాలో 34 గ్రామ పంచాయతీలు ఉండగా, 65,773 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 33,020 మంది, మహిళా ఓటర్లు 32,750 మంది ఉన్నారు. ఇతర ఓటర్లు ముగ్గురు ఉన్నారు. మేడ్చల్‌ జిల్లాలో మొత్తంగా 320 పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశముంది. ఇందులో 200పైగా ఉన్న ఓటర్ల కోసం 197 పోలింగ్‌ కేంద్రాలు, 400 ఓటర్ల కోసం 98 పోలింగ్‌ కేంద్రాలు, 401 నుంచి 650 ఓటర్ల కోసం 25 పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ లెక్కన రంగారెడ్డి జిల్లాలో కూడా 200 మంది ఓటర్ల నుంచి 600 మంది ఓటర్లకు ఒక పోలింగ్‌ కేంద్రాన్ని గుర్తించారు. బ్యాలెట్‌ పేపర్లను పంచాయతీ అధికారులు అందించనుండగా, గుర్తులను మాత్రం ప్రింటింగ్‌ ప్రెస్‌లో ముద్రించనుండటంతో వాటి వివరాలను ఇప్పటికే సేకరించారు. అభ్యర్థులను బట్టి బ్యాలెట్‌ పేపర్‌ సైజ్‌ ఉంటుంది.

తుది పోలింగ్‌ కేంద్రాల జాబితా

గ్రామాలు, వార్డుల వారీగా ఇప్పటికే ఓటరు జాబితాలను సిద్ధం చేశారు. తాజాగా పోలింగ్‌ కేంద్రాలపై అభ్యంతరాలను స్వీకరించి వాటిని పరిష్కరించి.. ఈ నెల 17న తుది జాబితాను ప్రకటించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే మండల స్థాయిలో పోలింగ్‌ కేంద్రాల జాబితాపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి అభ్యంతరాలను స్వీకరించారు. ఈ నెల 18న పరిష్కారం చేసేలా చర్యలు చేపడుతున్నారు. ఎక్కువ మంది ఓటర్లు ఉన్నచోట నూతనంగా మరొకటి ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కుటుంబ సభ్యుల ఓట్లు వేరువేరు పోలింగ్‌ కేంద్రాల్లో ఉండగా.. వాటిని ఒకే కేంద్రంలో ఉండేలా సర్దుబాటు చేశారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది నియామకం, సంబంధిత అధికారులు, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించడం తదితర ఎన్నికల ప్రక్రియ నిర్వహించేందుకు చకచకా ఏర్పాట్లు పూర్తవుతున్నట్లు అధికార వర్గాలు తెలుపుతున్నారు.



వ్యూహాలకు పదును

పార్టీల గుర్తులు లేకపోయినా అభ్యర్థిని బట్టి ప్రజలు చూసే ఓటేస్తారు. ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్‌ మద్దతుదారులు రంగంలోకి దిగనున్నారు. పార్టీ నేతలు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మాజీ ప్రజాప్రతినిధులు మళ్లీ బరిలో నిలిచేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. రిజర్వేషన్లు ఎలా ఉన్నా తమ కుటుంబీకులను నిలపాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈసారి పట్టు బిగిస్తే రాబోయే ఎన్నికల నాటికి బలోపేతం కావాలన్నది బీజేపీ వ్యూహంగా కనిపిస్తోంది.

- బీసీ రిజర్వేషన్లు పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ముగిసి, డేటా ఎంట్రీ పూర్తయ్యింది. రిజర్వేషన్లను కొత్తగా ఖరారు చేయనుండటంతో మార్పులు జరిగే అవకాశం ఉంది. దీంతో ఆశావాదుల్లో ఉత్కంఠ పెరిగింది. ఎన్నికల నోటిఫికేషన్‌ ఎప్పుడు వచ్చినా సమర్థంగా ఎన్నికలు నిర్వహించేందుకు ముందస్తుగా పకడ్బందీ ఏర్పాట్లతో పాటు సామగ్రిని మండలాల వారీగా పంపిణీ చేస్తున్నామని పంచాయతీ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఎన్నికలపై భిన్నస్వరాలు

మేడ్చల్‌ జిల్లాలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం గ్రామ పంచాయతీ ఎన్నికలకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ రాజకీయ వర్గాల నుంచి భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. పంచాయతీ ఎన్నికలు జరుగుతాయా? లేదా? అన్న మీమాంస కూడా రాజకీయ వర్గాల్లో నెలకొంది. జిల్లాలోని 34 గ్రామ పంచాయతీలు ఉండగా, వీటిని ప్రభుత్వం నాలుగు మున్సిపాలిటీలుగా మార్చే అవకాశముందన్న ప్రచారం కూడా స్థానిక రాజకీయ వర్గాలతో పాటు ప్రజల్లో జోరుగా సాగుతోంది.